భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి


రామచంద్రుడికి పూజలు చేస్తున్న వేదపండితుడు

భక్తులతో పోటెత్తిన వైష్ణవ దేవాలయాలు


రాధాకృష్ణులకు హారతి ఇస్తున్న వేదపండితుడు


విష్ణు సహస్రనామ పారాయణం చేస్తున్న భక్తులు

నల్లకుంట: భీష్మ (జయ) ఏకాదశిని పురస్కరించుకొని వైష్ణవాలయాలు భక్తులతో పోటెత్తాయి. ఈ సందర్భంగా న్యూనల్లకుంటలోని న్యూరామాలయంలో అర్చకస్వాములు అప్పారావు, గౌరీ మంత్రోచ్ఛరణల నడుమ సీతారామాంజనేయస్వామికి అభిషేకం చేశారు. ఆలయ ప్రాంగణంలోని కృష్ణ మందిరంలో అర్చకులు నాగేంద్ర శర్మ రాధాకృష్ణులను పట్టు వస్త్రాలు, పూల మాలలతో అలంకరించారు. ఇష్టదైవాల దర్శనం కోసం వచ్చిన భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

సుందరకాండ,
విష్ణు సహస్రనామ పారాయణం..
అఖిల భారత శ్రీరామనామ కోటిలేఖన మహా సంఘం వార్షికోత్సవాలు శనివారం న్యూనల్లకుంటలోని సీతామాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం మహిళా భక్తులు సుందరకాండ, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం చేశారు. మధ్యాహ్నం దాశరథి శతకంలోని పలు పద్యాలను తీసుకుని విద్యార్థులకు 'పద్య పఠనం' పోటీలను నిర్వహించారు. ఇందులో ఆరు పాఠశాలల నుంచి మొత్తం 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన నలుగురు విద్యార్థులకు న్యాయ నిర్ణేత కడియాల ప్రభాకర్‌రావు ప్రశంసపత్రాలు, బహుమతులు అందజేశారు. ఆలయ వేదపండితులు సాయంత్రం శ్రీరామనామ మహిమ ప్రవచనాలు చేశారు. ఈ సందర్భంగా సంధ్య శ్యామ్ ప్రదర్శించిన కూచిపూడి నాట్యం భక్తులను ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో మహాసంఘం అధ్యక్షుడు ఆర్.ఎస్. రంగదాసు, కార్యదర్శి కేవీ తిరుమలరావు, కోశాధికారి పి.సత్యనారాయణ, సహాయ కార్యదర్శి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో గంగపుత్రుల ఆధ్వర్యంలో..
ముషీరాబాద్: ముషీరాబాద్‌లో భీష్మ ఏకాదశిని శనివారం గంగపుత్రులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీష్మ పితామహుడి చిత్రపటానికి ముషీరాబాద్‌లో ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు పూజలు చేశారు. గంగపుత్రులు ఐక్యంగా ఉంటేనే తమ న్యాయమైన హక్కులను సాధించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, శ్రీహరి, గంగపుత్ర సంఘం నాయకులు నవీన్, గోవింద్ పాల్గొన్నారు.

గంగపుత్ర కాలనీలో...
బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పూసగోరఖ్‌నాథ్ ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ గంగపుత్ర జెండాను ఆవిష్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు జ్ఞానేశ్వర్, పూస శ్రీరాములు, నర్సింగ్, రాంనగర్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


ముషీరాబాద్‌లో భీష్మ పితామహుడి చిత్రపటం వద్ద బిజ్జి శత్రు, గంగపుత్రులు


గంగపుత్ర కాలనీలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

నేడు ఉచితంగా మధుమేహ పరీక్షలు

చిక్కడపల్లి: వాకర్స్ ఇంటర్నేషనల్, వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హెల్త్ సిటీ ఆధ్వర్యంలో ఉచితంగా మధుమేహ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు, డయాబెటిక్ ఛైర్మన్ జీకే రమణ ఓ ప్రకటనలో తెలిపారు. చిక్కడపల్లిలోని సాయి డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ఉద్యోగులకు సాంకేతిక పరిజ్ఞానం అవసరం

బంజారాహిల్స్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ స్టాఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (సీఎస్‌టీడీ) ఆధ్వర్యంలో ఇటీవల టీజీఎస్పీ ద్వారా నియమితులైన జూనియర్ అసిస్టెంట్ సిబ్బందికి వారం రోజుల పాటు నిర్వహించిన 'ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ ఫర్ జూనియర్ అసిస్టెంట్స్' శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ జి.పుష్పా చక్రపాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఉద్యోగులకు సాంకేతిక పరిజ్ఞానం చాలా అవసరమని సూచించారు. ఈ శిక్షణ ద్వారా భవిష్యత్తులో విశ్వవిద్యాలయ పాలనా విభాగంలో కీలక భూమికను నిర్వహిస్తారని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయ కృష్ణారెడ్డి మాట్లాడుతూ... ఏ సంస్థలోనైనా సజావుగా కార్యకలాపాలు జరిగేలా చూసుకోవడంలో ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

జేఏసీ ఛైర్మన్ సుల్తాన్ యాదగిరి


శిక్షణ తరగతుల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుల్తాన్ యాదగిరి


చిక్కడపల్లి: తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఛైర్మన్ సుల్తాన్ యాదగిరి అన్నారు. శనివారం సాయంత్రం చిక్కడపల్లిలోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 9న ఉప్పల్ మేడిపల్లి, పీర్జాదిగూడ ప్రాంతాలలో తెలంగాణ మహిళా ఉద్యమకారుల శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు శిక్షణా తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఉద్యమకారులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యమకారుల శిక్షణ తరగతుల వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి, కోశాధికారి చంద్రన్నప్రసాద్, నేతలు యాదగిరి, గంగిరాజు, శంకర్, సురేష్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



ముషీరాబాద్: శ్రీనివాస కల్యాణం ట్రస్ట్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ విద్యామండలి పరిధిలోని మేడిబావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు నోటు పుస్తకాలు, దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు ఉమా సదాశివన్, ట్రస్ట్ చైర్మన్ స్వప్న, ఉపాధ్యాయులు సురేఖ, శైలజాకుమారి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సంబురాలు



అంబర్‌పేట: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ భారీ మేజారిటీతో విజయం సాధించడంతో ఆ పార్టీ నేతలు పెద్ద ఎత్తున సంబురాలు చేసుకున్నారు. శనివారం పటేల్‌నగర్ చౌరస్తాలో అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు నరేష్‌గౌడ్ బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానికులకు మిఠాయిలు పంచి తమ సంతోషాన్ని పంచుకున్నారు.

పాలాభిషేకం

అంబర్‌పేట: ఎస్సీ వర్గీకరణ అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి అంసెబ్లీలో తీర్మానం చేయడం చరిత్రాత్మకమని కాంగ్రెస్ ఖైరాతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్ తెలిపారు. శనివారం అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తాలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ దళిత సంఘం నాయకులు బోయ వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు హరినాథ్ రెడ్డి, రామ్మోహన్‌రావు, మురళీకృష్ణ, విజితారెడ్డి, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా శ్యామలాదేవి నవరాత్రి ఉత్సవాలు

ముషీరాబాద్: డివిజన్ పరిధిలోని ఎంసీహెచ్‌కాలనీలో శనివారం శ్రీశక్తి పీఠం ఉపాసకులు శక్తి ఆనందాస్వామి (ప్రవీణ్) ఆధ్వర్యంలో అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్యామలాదేవి హోమాన్ని నిర్వహించారు. అనంతరం శక్తి ఆనందాస్వామి మాట్లాడుతూ.. ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించేందుకు శ్యామలాదేవి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన చేశారు. ఈ పూజల్లో భక్తులు విజయ్‌శంకర్, దడివి రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.


శ్యామలాదేవి హోమం నిర్వహిస్తున్న శక్తి ఆనందాస్వామి

శంకరమఠంలో మహాసన్నిధానం జన్మనక్షత్ర పూజలు

నల్లకుంట: శృంగేరి పీఠాధీశులు భారతి తీర్థస్వామి మహా సన్నిధానం జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని శనివారం నల్లకుంట శంకరమఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శక్తి గణపతి, చంద్రమౌళీశ్వరస్వామి, శారదామాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మఠం ప్రాంగణంలో పండితుల ఆధ్వర్యంలో యజుర్వేద పారాయణం జరిగింది. సాయంత్రం సత్యనారాయణ వ్రతం చేశారు. ఇందులో పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.


శంకరమఠంలో యజుర్వేద పారాయణం చేస్తున్న పండితులు


శంకరమఠంలో సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తున్న పండితుడు

చదువుతోనే మహిళలకు గౌరవం

హైకోర్టు జడ్జి జస్టిస్ డా. రాధారాణి


వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ డా. రాధారాణి

కాచిగూడ: ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతోనే మహిళలకు గౌరవం లభిస్తుందని తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ డాక్టర్ రాధారాణి అన్నారు. శనివారం బర్కత్‌పురలోని తెలంగాణ యువతి మండలి ఎ.శ్యామలదేవి మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టపడి చదివితేనే ఉన్నత స్థాయికి ఎదుగుతారని అన్నారు. అన్నింటి కంటే గొప్ప సంపద చదువేనని చెప్పారు. పేదరికాన్ని జయించి ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి చదువు ఒక్కటే మార్గమని తెలిపారు. నేడు చదువుకోవడానికి అనేక అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని పేర్కొనినారు. సరైన అవగాహన లేక మహిళలు మధ్యలోనే చదువును ఆపేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు ఎంచుకున్న కోర్సును ఇష్టంగా చదివితే విజేతగా నిలుస్తారని అన్నారు. కార్యక్రమంలో ఓయు ఇంగ్లిష్ విభాగం చైర్‌పర్సన్ ప్రొ. పరిమల కులకర్ణి, తెలంగాణ యువతి మండలి అధ్యక్షురాలు ఆర్.పద్మజ మల్లికార్జున్, కార్యదర్శి నివేదిత కుమార్, కరస్పాండెంట్ డాక్టర్ డి.వసుందర, ప్రిన్సిపాల్ బి.లావణ్య కుమారి తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. క్రీడా, సాంస్కృతిక, అకడమిక్స్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

'విద్యార్థులు వినూత్నంగా ఆలోచిస్తేనే ఎదుగుతారు'

ఓయూ యూసీసీఅండ్‌బీఎం ప్రిన్సిపాల్ శేఖర్



కాచిగూడ: వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలు చేసే వారే ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఓయూ యూసీసీ అండ్ బీఎం ప్రిన్సిపాల్ ప్రొ. శేఖర్ అన్నారు. నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో శనివారం జాగృతి డిగ్రీ కళాశాల బీకాం, బీబీఏ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు రీసెర్చ్ మెథడాలజీ ప్రాజెక్ట్ రూపకల్పన కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జోసెఫిన్ రెడ్డి, డైరెక్టర్ శశికిరన్‌రెడ్డి, నీతారెడ్డి, మధుసూదన్, మేఘచంద్ర, అరవింద్, రాగిణి, ఏఓ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ గాన గోష్ఠి

చిక్కడపల్లి: త్యాగరాయ గానసభలో ఉచితంగా సంగీతంలో శిక్షణ ఇస్తున్నామని గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి తెలిపారు. చిక్కడపల్లిలోని శనివారం గానసభలో గానసభ సంగీత గురువు సంయుక్త శిష్య బృందం శాస్త్రీయ గానగోష్ఠి సుశ్రావ్యంగా సాగింది. అన్నమయ్య త్యాగరాయ కీర్తనల మధురంగా గానం చేశారు. అనంతరం కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ.. డాక్టర్ కేవీ రమణాచారి జన్మదినం సందర్భంగా వారం రోజులపాటు వివిధ కళా ప్రక్రియలలో కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలిపారు. వేదికపై ప్రముఖ గాయకుడు చింతలపూడి త్రినాథరావు, సామాజిక కార్యకర్త వెంకటరావు పాల్గొన్నారు.


సంగీత గురువు సంయుక్తను సన్మానిస్తున్న జనార్దనామూర్తి, చింతలపూడి త్రినాథరావు

బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి

ముషీరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని ముషీరాబాద్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌గుప్తా అన్నారు. శనివారం ఎంసీహెచ్ కాలనీలో డివిజన్ బీఆర్‌ఎస్ బూత్‌స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఇంటింటికి వెళ్లి బీఆర్‌ఎస్ సిద్ధాంతాలు, ఆశయాలను వివరించాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర కేలండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్ కుమార్, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, డివిజన్ మహిళా కమిటీ అధ్యక్షురాలు శోభ, శ్రీధర్‌గౌడ్, డిఎం శ్రీనివాస్, ఫిరోజ్ ఖాన్, మురళీ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే సమాజంపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థుల ఫుడ్‌స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ


విద్యార్థుల నృత్య ప్రదర్శన

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: విద్యార్థి దశలోనే సమాజంపై అవగహన పెంచుకోవాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. అంతేకాకుండా విద్యార్థులు ఫుడ్‌స్టాల్‌ను సైతం ప్రదర్శించి ఔరా అనిపించారు. ఈ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ... ఎంతో మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకున్నారని అన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ విద్యాసంస్థల కార్యదర్శి గడ్డం వినోద్, కరస్పాండెంట్ సరోజ వివేక్, డైరెక్టర్ విష్ణుప్రియా, ప్రిన్సిపాల్ విఠలాచారి, రాధారాణి, ఏవో కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

11న బృహత్ శ్రీధరీయం గ్రంథావిష్కరణ

చిక్కడపల్లి: ఉపాసన సంస్థ, త్యాగరాయ గానసభల సంయుక్త ఆధ్వర్యంలో అవధాన ప్రాచార్య, పద్య కళాతపస్వి ధూళిపాక మహాదేవమణి రచించిన బృహత్ శ్రీధరీయం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్నామని సంస్థ ప్రధాన కార్యదర్శి మహేశ్వరి, ఉపాధ్యక్షుడు ఎస్‌ఆర్ వోలేటి తెలిపారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికను అధ్యక్షుడు దివాకర్‌రావు అలూరి, కోశాధికారి అలూరి కల్యాణితో కలసి వారు శనివారం ఆవిష్కరించారు. ఈనెల 11న సాయంత్రం 5.15 గంటలకు కార్యక్రమం మొదలవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాసన సమ్మాన్-2025 పేరిట మహాదేవమణికి ఆత్మీయ సత్కారం చేస్తామని పేర్కొన్నారు.



పనులు త్వరగా పూర్తి చేయాలి



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ముషీరాబాద్ నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అధికారులకు ఆదేశించారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో సుందరయ్య పార్కు ఎదురుగా రూ.10లక్షల వ్యయంతో సీవరేజ్ పైప్‌లైన్ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పైప్‌లైన్ పనులు చేపడుతున్నామని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఈ పనులను విడుతలవారీగా చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె.రవిచారి, బీఆర్‌ఎస్ నేతలు శంకర్, వెంకటకృష్ణారావు, ప్రభాకర్, మురళీ, కళ్యాణ్‌నాయక్, రమేష్‌రెడ్డి, కూరగాయల శ్రీను, పీవీ రాజు, సత్యనారాయణ, బీజేపీ నాయకులు గడ్డం నవీన్, శ్రీనివాస్, ఉపేందర్, వెంకటేష్ పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను

మత్స్యకార మహిళలకు వర్తింపజేయాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో జరిగిన మహిళా జాతీయ సదస్సులో ఎమ్మెల్యే ముఠాగోపాల్


సదస్సులో మాట్లాడుతున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న సంక్షేమ పథకాలను మత్స్యకార మహిళలు, మత్స్యకార సొసైటీలను వర్తింపజేయాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ కోరారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మత్స్యకార, మత్స్యకార్మిక మహిళ జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ... మన దేశంలో 12.3 మిలియన్లకు పైగా మహిళలు చేపలు పట్టడం, ప్రాసెసింగ్, విక్రయం, వలలు తయారు చేయడం వంటి తదితర పనుల్లో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికి వారికి తగిన గుర్తింపు లభించడం లేదన్నారు. మహిళలు అనేక రకాలుగా లింగ వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకార మహిళల అభివృద్ధికోసం తన వంతుగా కృషి చేస్తానని అన్నారు.

◆ తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ మాట్లాడుతూ... చేపల పరిశ్రమల్లో మహిళలు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని అన్నారు. అస్థిర ఉపాధి, ప్రమాదకర పరిస్థితులు, వేతనాలలో లింగ వివక్షకు గురవుతున్నారని అన్నారు. మత్స్యకారుల అభివృద్ధిలో ఆరోగ్య సంబంధిత సమస్యలు మత్స్య మహిళలను బలహీన పర్చుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మత్స్య మహిళా కార్మికుల సమస్యలపై వారిలో అవగాహన పెంచేందుకు రెండు రోజుల పాటు సదస్సును నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత నాయకులు దేభాశిష్ బర్మన్, పులివెల్లి స్టాన్లీ, జి. మమత, సుదన్ దాస్, రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ, కొప్పు పద్మ, మహిళా విభాగం రాష్ట్ర కో-కన్వీనర్‌లు అమరావతి, బక్కి బాలమణి, కాగు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ప్రీ ప్రైమరీ విద్యకు ఎంతో ప్రాముఖ్యం ఉంది'



హెచ్‌పీఎస్‌కు అవార్డును అందజేస్తున్న వరల్డ్ ఎడ్యుకేషన్ నిర్వాహకులు ఫయాజ్ ఖాన్

కవాడిగూడ: విద్యార్థి దశలో ప్రీ-ప్రైమరీ విద్య ఎంతో ప్రాముఖ్యత ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎడ్యుకేషన్ వరల్డ్ ఆధ్వర్యంలో శనివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని హోటల్ మారియెట్‌లో ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ ఎడ్యుకేషన్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఉన్న 138 నగరాల నుంచి దాదాపు 360 ప్రీ-ప్రైమరీ పాఠశాలల యజమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక విద్యా బలోపేతానికి విద్యారంగంలోని నిపుణులతో చర్చించారు. ఈ సందర్భంగా రాకెట్ లెర్నింగ్ సహ వ్యవస్థాపకులు సిద్ధాంత్ సచిదేవా 'ప్రీ-ప్రైమరీ ఎడ్యుకేషన్ పరివర్తన పాత్ర' అనే అంశంపై ప్రసంగించారు. డాక్టర్ స్వాతి పోపట్ వాట్స్, లీనా ఆశర్ ప్రాథమిక విద్యాబోధనలో పలు మెలకువలను సూచించారు.

◆ ఈ సందర్భంగా ఎడ్యుకేషన్ వరల్డ్ సీఈవో భవిన్‌షా మాట్లాడుతూ... విద్యాబోధనలో సులభతరమైన మార్గాలు అన్వేషించడానికి ఇలాంటి చర్చా వేదికలు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. ప్రతి మనిషి జీవితంలో బాల్య విద్య అత్యంత ప్రధానమైందని పేర్కొన్నారు. విద్యాబోధనలో వినూత్న బోధనా పద్ధతులను అనుసరిస్తున్న ప్రీ-ప్రైమరీ స్కూల్ యజమానులకు ప్రీ స్కూల్స్ ర్యాంకింగ్స్ 2024-25 అవార్డులను అందజేశారు.

రంగరాజుగౌడ్ బీజేపీకి చేసిన సేవలు మరువలేనివి

ముగిసిన బీజేపీ నేత రంగరాజుగౌడ్ అంత్యక్రియలు



రంగరాజుగౌడ్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

కవాడిగూడ: బీజేపీ పటిష్టత కోసం అహర్నిషలు పాటుపడిన వ్యక్తి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కవాడిగూడ గౌడ సంఘం అధ్యక్షుడు రంగరాజుగౌడ్ అని పలువురు నాయకులు కొనియాడారు. 1983లో బీజేపీలో చేరిన నాటి నుంచి చివరిశ్వాస వరకు పార్టీ పటిష్టతకు ఆయన ఎంతో కృషిచేశారని అన్నారు. రంగరాజుగౌడ్ బీజేపీకి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. శనివారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీలు రాంచందర్‌రావు, కాసాని జ్ఞానేశ్వర్, కార్పొరేటర్లు రచనశ్రీ, రవిచారి, బీజేపీ మహాంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ తదితరులు రంగరాజుగౌడ్ భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవాడిగూడలో రంగరాజు గౌడ్ మృతికి సంతాప సూచకంగా పలువురు వ్యాపారులు దుకాణాలు బంద్ చేశారు.